TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP    సంపుటి : 1    సంచిక: 26    19-6-2025 గురువారం    పేజీలు : 8    వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri

## 'బ్రహ్మోస్'ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయండి

### బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధులను కోరిన సీఎం రేవంత్

### సానుకూలంగా స్పందించిన సంస్థ ఎండీ



హైదరాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 18 : బ్రహ్మోస్ ఏరో స్పేస్‌ను హైదరాబాద్‌కు విస్తరించాలని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఇప్పటికే హైదరాబాద్‌లో రక్షణ రంగానికి సంబంధించి అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఉన్నాయని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రతినిధి బృందం, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది.తదితరులు సీఎంను కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరణకు తెలంగాణను ఎంచుకోవాలని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని సీఎం చెప్పారు. ఈ ప్రతిపాదనకు బ్రహ్మోస్ ఎండీ జైతీర్థ్ జోషి సానుకూలంగా స్పందించారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



## హైటెక్ సిటీలో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్

### ఆసియా పసిఫిక్‌లో మొదటిది.. ప్రపంచంలో ఐదో కేంద్రం

### ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 18 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. దిగ్గజ ఐటీ సంస్థ గూగుల్ తన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎసఈసీ) నగరంలో నెలకొల్పింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోనే ఇది మొట్టమొదటి జీఎసఈసీ కాగా.. ప్రపంచంలో ఐదో కేంద్రం. హైటెక్ సిటీలోని దివ్యశ్రీ బిల్డింగ్‌లో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రతా పరిష్కారాల కోసం గూగుల్ ఈ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు గర్విస్తున్నానని తెలిపారు. "గూగుల్, హైదరాబాద్ పాత స్నేహితులు" అని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్.. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గూగుల్ తన మొదటి కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కాగా, ఈ కేంద్రం హైదరాబాద్ ఐటీ రంగాన్ని మరింత ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

## బనకచర్ల పాపం కేసీఆర్‌దే



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 18 : గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు పాపానికి పునాది వేసిందే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని.. రాష్ట్రానికి ఆయన తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుపై చర్చించేందుకు బు?ధవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని అన్ని పార్టీల లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్.. భేటీ ముగిశాక సచివాలయంలోనే ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు అన్యాయం, తీరని ద్రోహం జరిగితే.. ఆ విషయంలో శిక్షించి, ఉరి తీయాల్సింది కేసీఆర్, హరీశ్‌రావునేనని ధ్వజమెత్తారు. వారు ఏనాడూ తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేయలేదని.. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి, కుట్రలు చేశారని మండిపడ్డారు. ప్రాజెక్టుల విషయంలో సర్వపాపాలు చేసి, పాపాల భైరవులుగా మారి రాష్ట్రానికి అన్యాయం చేశారని దుయ్యబట్టారు. వారే ఇప్పుడు.. 'బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ మాట్లాడట్లేదు' అంటూ తనపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ఏపీ శాసనసభలో సీఎం చంద్రబాబు మాట్లాడిన వెంటనే తాము కేంద్ర మంత్రిని కలిసి.. ఆ ప్రాజెక్టుతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంతో పాటు అన్ని వివరాలనూ తెలిపామని సీఎం చెప్పారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రితోనూ చర్చించామని.. ఇప్పటికే ఈ విషయంలో కేంద్ర జల్‌శక్తి మంత్రికి రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ లేఖలు రాశారని గుర్తుచేశారు. అఖిల పక్ష సమావేశం నిర్వహించడం వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలేవీ లేవన్న సీఎం.. భవిష్యత్ కార్యాచరణ, ప్రణాళికలపై ప్రతిపక్షాలను సూచనలు అడిగినట్టు తెలిపారు. రాజకీయ అంశాలకు అవకాశం ఇవ్వకూడదని భావించే.. ఈ భేటీకి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, బీఆర్ఎస్ పార్లమెంటు సభ్యులను ఆహ్వానించామన్నారు.

## చివరి అస్త్రంగా న్యాయపోరాటం



### బనకచర్లపై తెలంగాణ సర్కారుకు అఖిలపక్షం మద్దతు

### ఈ ప్రాజెక్టు కడితే ఏపీ నీటి హక్కులు కోరే ప్రమాదం

### ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్

### కలిసికట్టుగా పోరాడుదాం: బీజేపీ ఎంపీలు

### రాజకీయాలొద్దు.. వాకౌట్ చేస్తున్నా: ఎంపీ వద్దిరాజు

హైదరాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 18 : గోదావరి–బనకచర్లపై చివరి అస్త్రంగా న్యాయపోరాటం చేయాలని అఖిలపక్షం ఎంపీలు నిర్ణయించారు. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం చొరవ, చేస్తున్న పోరాటానికి మద్దతిచ్చారు. ఏపీ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై ఎంపీల అభిప్రాయ సేకరణకు బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రెండున్నర గంటలపాటు జరిగిన అఖిలపక్షం సమావేశంలో వారు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ నుంచి డీకే అరుణ, రఘునందన్‌రావు, బీఆర్ఎస్ నుంచి వద్ది రాజు రవిచంద్ర, మజ్లిస్ తరఫున అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నుంచి రేణుకాచౌదరి, మల్లురవి, సురేశ్ షెట్కార్, బలరాంనాయక్, రవికుమార్ యాదవ్, రామసహాయం రఘురామిరెడ్డి, రఘువీర్‌రెడ్డి, జి.వంశీ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. డీకే అరుణ, రఘునందన్‌రావు మాట్లాడుతూ.. బనకచర్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేయదని భావిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ అన్యాయం జరిగితే.. సంఘటితంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. గోదావరి, కృష్ణాల్లో ఏయే ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉంది? ప్రతిబంధకాలేంటి? అని వారు అడగ్గా.. మధ్యలో జోక్యం చేసుకున్న సీఎం.. "ఆ వివరాలను ఎంపీలందరికీ పంపుతాం" అని స్పష్టం చేశారు. మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ సహా.. కేంద్రానికి ఫిర్యాదులు చేసి, అన్ని వేదికలను ఆశ్రయించాకే.. చివరి అస్త్రంగా న్యాయపోరాటం చేద్దామని అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి బోర్డుల సమావేశంలోనూ ఈ అంశాన్ని లేవనెత్తి, పర్యావరణ అనుమతులు రాకుండా కేంద్ర నిపుణుల మదింపు కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ అభిప్రాయాలను రేణుకాచౌదరి సమర్థించారు.

## కేసీఆర్ వ్యాఖ్యలపై రేవంత్ వక్రీకరణ:హరీశ్



హైదరాబాద్,(సందేశం టైమ్స్) జూన్ 18: గోదావరిపై బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు– నాటి సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ వక్రీకరించారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం వక్రబుద్ధితో సీఎం ప్రజల ముందు అసత్యాలు ఉంచారని, కానీ ఆయనకు తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలన్న తపనే లేదని 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అపెక్స్ కౌన్సిల్ సమావేశ అజెండా–5ను దాచి పెట్టి, అజెండా–1 అంశాలే ప్రస్తావించారని హరీశ్ చెప్పారు. గోదావరి– కృష్ణా నదుల అనుసంధాన ప్రాజెక్టులపై ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణను సంప్రదించకుండా ముందుకెళ్లరాదని అజెండా–5లో నాడు కేసీఆర్ స్పష్టంగా పేర్కొన్నారని వెల్లడించారు.

## టీజీఎస్ ఆర్టీసీ తొలి మహిళా కండక్టర్లకు సన్మానం



హైదరాబాద్, (సందేశం టైమ్స్)జూన్ 18 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో తొలి మహిళా కండక్టర్లు అయిన ముగ్గురిని సంస్థ యాజమాన్యం బుధవారం సన్మానించింది. కండక్టర్‌గా 28 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన శ్రీదేవి, అనిత, మెహిదీపట్నం డిపోకు చెందిన శారదను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఎన్నో ఏళ్లుగా ప్రజా రవాణా రవాణా వ్యవస్థలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఈ ముగ్గురిని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో సత్కరించింది. ఈ నేపథ్యంలో శ్రీదేవి, అనిత, శారద సేవలు కొనియాడుతూ టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం కూడా సన్మానించింది.

# బనకచర్లను అడ్డుకోవడమే లక్ష్యం – రేవంత్



(సందేశం టైమ్స్) జూన్ 18: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టబోయే పోలవరం–బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'తెలంగాణ రైతులకు కృష్ణా, గోదావరి నదుల నీరు అత్యంత అవసరం. ఈ నీటి మీదే మన వ్యవసాయ రంగం ఆధారపడినందున, ఏపీ తీరును నిరాకరించక తప్పదు' అని పేర్కొన్నారు. ఇరు నదులపై తెలంగాణకు సముచిత హక్కు ఉండాల్సిందేనని తేల్చారు.రాజకీయాలకు అతీతంగా పోరాటం అవసరం

బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసికట్టుగా పోరాటం చేయాలన్నారు సీఎం రేవంత్. ఇటీవలి పార్టీ ఎంపీల భేటీలో మాట్లాడుతూ, కేంద్రాన్ని కోరేందుకు, ప్రధాని మోదీతో పాటు కేంద్ర జలశక్తి మంత్రిని కలవాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. "తెలంగాణ హక్కులకు విఘాతం కలిగించే ఈ ప్రాజెక్టు అమలు కానివ్వం. ఇది రాష్ట్ర భవిష్యత్తును ప్రభావితం చేసే విషయం. అందుకే ప్రతీ పార్టీ, ప్రతీ నాయకుడు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి కలిసి రావాలి" అని పిలుపునిచ్చారు. కేసీఆర్–జగన్ కూటమి నాటిదే బనకచర్ల పునాది

గతంలో గోదావరి జలాలను రాయలసీమకు తరలించే యత్నం అప్పటి సీఎం కేసీఆర్ మరియు వైఎస్సార్‌సీపీ నేత జగన్ కలిసి చేశారన్నారు రేవంత్. అప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణకు నష్టం కలిగించే ఈ ప్రాజెక్టుకు మద్దతుగా వ్యవహరించిన వారిపై ప్రజలు మర్చిపోకూడదన్నారు. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులకు వ్యతిరేకంగా ఉందని మరోసారి స్పష్టం చేస్తూ, దాన్ని ఆపడానికి అవసరమైన ప్రతీ చర్యను తీసుకుంటామని రేవంత్ హామీ ఇచ్చారు.

# అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ కొరడా




(సందేశం టైమ్స్)జూన్ 18: ఒక మహానగరంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, నగర పాలక సంస్థ అయిన జీహెచ్ఎంసీ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు అక్రమ నిర్మాణాలు. గత కొన్నేళ్లుగా అనుమతులు లేకుండా, మంజూరైన ప్లాన్‌ను ఉల్లంఘించి, నిబంధనలను అతిక్రమించి నిర్మించబడుతున్న భవనాలు నగర రూపాన్ని దెబ్బతీసే విధంగా తయారవుతున్నాయి.

హైకోర్టు ఆదేశాలతో మరింత గట్టిగా జీహెచ్ఎంసీ తాజాగా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం, అక్రమంగా నిర్మిస్తున్న భవనాలపై పట్టుబట్టి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అక్రమ నిర్మాణాలు, అనుమతి తీసుకున్న దాని కంటే అదనంగా నిర్మించిన అంతస్తులను సీజ్ చేయాల్సిందిగా కమిషనర్ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా నిర్మాణాలను సీజ్ చేయడమేకాక షోకాజ్ నోటీసులు కూడా జారీ చేయాలని తెలిపారు. ఇందుకుగాను జీహెచ్ఎంసీ చట్టం 1955, సెక్షన్ 461–ఏ, టీజీ–బీపాస్ నిబంధనల ప్రకారం సంక్రమించిన అధికారాలతో అలాంటి భవనాలు సీజ్ చేసే అవకాశముందని కమిషన్ కర్ణన్ తాజాగా జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. మూడు రోజుల గడువు – నివాసితులకు ముందస్తు నోటీసులు ఇప్పటికే ఇలాంటి భవనాల్లో నివసిస్తున్న వారికి మూడు రోజుల గడువు ఇస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ గడువు పూర్తయ్యాక వాటిని సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. ఇక భవనానికి ఉన్న అన్ని ప్రవేశ, బయటకు వెళ్లే దారులు, లిఫ్ట్, మెట్లు, ర్యాంపులను ఎరుపు రంగు రిబ్బన్‌తో మూసి వేయాలని తెలిపారు. ఇక తప్పు చేసినవారికి కఠిన చర్యలు తప్పవు ప్రకారం,

# సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన రాజా సింగ్




(సందేశం టైమ్స్)జూన్ 18: కొత్త గోశాల నిర్మించాలనే నిర్ణయం, తల్లి ఆవు గురించి ఆలోచించినందుకు, విధివిధానాలపై కమిటీని వేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. వేల సంఖ్యలో ఆవులు, దూడలు, ఎద్దులను ఇల్లీగల్ స్లేటర్ హౌస్‌లో చంపుతున్నారని దాని గురించి సీఎం ప్లాన్ ఆఫ్ యాక్షన్ గురించి చెప్పాలని కోరారు. మోడల్ గోశాలలు కడుతున్నారని.. చాలా మంచిదని ఆయన వ్యాఖ్యానించారు.రెండవ పేరు సీఎం రేవంత్ రెడ్డిదే..గో రక్షణ గురించి ఒక స్పెషల్ పోలీస్ ఫోర్స్ తయారు చేయాలని, అందులో ఒక మెంబర్‌గా తనను కూడా ఉంచాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సిఎం రేవంత్ రెడ్డిని కోరారు. దేశంలోని ముఖ్యమంత్రులందరిలో గోవులకు సేవ చేసే నిజమైన ముఖ్యమంత్రి ఎవరని అడిగితే, గుర్తుకు వచ్చే రెండవ పేరు రేవంత్ రెడ్డిదేనని అన్నారు. మొదటి పేరు యూపీ సీఎం యోగి అని పేర్కొన్నారు. ఈ పనులన్నీ ముఖ్యమంత్రి చేస్తే భారత దేశంలో ఒక మంచి గుర్తింపు దొరుకుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు.ముగ్గురు అధికారులతో ఒక కమిటీ..తెలంగాణలో గోవుల సంరక్షణకు ఎంత ఖర్చైనా ప్రభుత్వం వెనుకాడబోదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గోవుల సంరక్షణకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. గోవుల సంరక్షణ కోసం వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ కమిటీని కోరారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ కమిటీలో ఉన్నారు. గో సంరక్షణపై రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకోవాలని అధికారులకు సూచించారు. గోశాలలకు భక్తులు పెద్ద సంఖ్యలో గోవులను దానం చేస్తున్నారని, కానీ వాటి సంరక్షణకు తగినంత స్థలం లేకపోవడం, ఇతర సమస్యలతో అవి ఎక్కువ సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాష్ట్రంలో తొలుత నాలుగు ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సీఎం ఆదేశించారు.గోశాలల నిర్మాణం ఎక్కడంటే..వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలోని విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలన్నారు. వేములవాడలో కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబర్చాలని సీఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలన్నారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన విధానపత్రాన్ని అధికారులు సీఎంకు అందజేశారు.

# భూభారతి కార్యక్రమం.....

(సందేశం టైమ్స్) జూన్ 18 ఈరోజు అల్లాదుర్గ్ మండలంలోని రాంపూర్ గ్రామంలో మన ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టు వంటి అభివృద్ధి కార్యక్రమాములోని ది ఒకటి భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టాన్ని భూభారతి చట్టం రైతుల చుట్టం ప్రజ బాట తీసుకువచ్చిన మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన ప్రియతమ నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య అండ్ సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ గారి ఆదేశానుసారం ఈరోజు రాంపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి బాట అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి అన్నారు లబ్ధిదారులు దరఖాస్తు ఫారాలను తాసిల్దార్ గారికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి అల్లాదుర్గ్ తాసిల్దార్ మల్లయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి ఆర్ ఐ సందీప్ ఆర్ ఐ చరనప్ప తాసిల్దార్ సిబ్బంది సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్ మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిలు సంజీవరెడ్డి రఘుపతి యాదయ్య పెంటయ్య షరీఫ్ రైతులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మర్యాదపూర్వకంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ని కలిసిన నూతన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యలి

## అభివృద్ధి సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా కృషి చేయాలి మంత్రి దామోదర్ రాజనర్సింహ



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 18జూన్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి. ప్రావీణ్య, మర్యాదపూర్వకంగా మంత్రి ని బుధవారం సంగారెడ్డి నివాసంలో కలిశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సంగారెడ్డి జిల్లాలో ముందుకు తీసుకెళ్లాలా ప్రణాళికలను రూపొందించాలని మంత్రి, జిల్లా కలెక్టర్ కు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, రైతు నేస్తం, భూభారతి చట్టం అమలు, విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి, మహిళా సాధికారత, శిశు సంక్షేమ పథకాల అమలు కు కృషి చేయాలని మంత్రి, కలెక్టర్ కు సూచించారు.

సామాన్యులకు ప్రభుత్వ పథకాలు చేరువ అయ్యేలా కృషి చేయాలని మంత్రి సూచించారు.

# కన్నీళ్లు పెట్టుకున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



(సందేశం టైమ్స్) జూన్ 18: ఖమ్మం జిల్లాకు కలెక్టర్‌గా సేవలందించిన ముజమ్మిల్ ఖాన్ బదిలీపై వెళ్లుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు ఆయనను ఎమోషనల్‌గా వీడ్కోలు చేశారు. ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల మధ్య వినయంగా, బాధ్యతతో పనిచేసిన ముజమ్మిల్ ఖాన్ మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రజల కోసం అందుబాటులో ఉండటం, అధికార యంత్రాంగాన్ని సమర్థంగా నడిపించడం ద్వారా ఆయన ప్రజా మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు.

వీడ్కోలు వేడుకలో భావోద్వేగం

అధికారిక వీడ్కోలు సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముజమ్మిల్ ఖాన్‌పై రూపొందించిన ప్రత్యేక వీడియో (ఏవీ)ను చూపించగా, ఆయన భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. తనకు లభించిన ఆదరణ, సహకారం తన జీవితంలో మరిచిపోలేనిదని అన్నారు. ఖమ్మం వాసులు తనకు చూపిన ప్రేమ ఎప్పటికీ గుర్తుగా నిలిచిపోతుందన్నారు.జనాల్లో భావోద్వేగ స్పందన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కి వీడ్కోలు చెప్పిన తరవాత సోషల్ మీడియాలో ప్రజలు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారు. "దీవర్ జశీశ్రీశ్రీవషిశీతీ జు" అనే హ్యాష్‌ట్యాగ్‌లతో పోస్ట్‌లు పెడుతున్నారు. ఖమ్మంలో కలెక్టర్‌గా పనిచేసిన ఆయన సేవలను ఎన్నటికీ మర్చిపోలేమంటూ నెటిజన్లు పోస్టులు వేస్తున్నారు. ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ఆయన పాత్రను ఎంతో మందీ ప్రశంసిస్తున్నారు.

# బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

హైదరాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 18: బేగంపేట ఎయిర్‌పోర్టుకుబాంబు బెదిరింపు కాల్ తీవ్ర కలకలం రేపింది. ఈరోజు ఉదయం (బుధవారం) 10:30 గంటలకు బేగంపేట్ విమానాశ్రయంలో బాంబు ఉన్నట్లు కొందరు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది బాంబ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వగా.. వెంటనే వారు అక్కడకు చేరుకుని ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. విమానాశ్రయంలోని ఉద్యోగులందరినీ బయటకు పంపించి బాంబు స్క్వాడ్, ఎస్పీఎఫ్ పోలీసులు క్షుణ్ణంగా సోదాలు చేశారు.అయితే విమానాశ్రయంలో ఎలాంటి బాంబు లేదని.. అదంతా ఫేక్ కాల్‌గా బాంబు స్క్వాడ్ గుర్తించింది. కాల్ చేసిన నెంబర్ ఆధారంగా ఆగంతకుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు

# రైతుకు పెరిగిన రుణ పరపతి

## 2025-26లో పంటల సాగుకు వర్తింపు
## స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఖరారు చేసిన ఎస్ఎల్టీసీ

అమరావతి(సందేశం టైమ్స్) జూన్ 18: రాష్ట్రంలో రైతులకు రుణ పరపతి సౌకర్యం పెరిగింది. 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటల సాగుకు రుణ పరిమితిని బ్యాంకర్ల కమిటీ పెంచింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు, పట్టు, పాడి పశువులు, కోళ్లు, చేపలు, రొయ్యల పెంపకానికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ని స్టేట్ లెవల్ టెక్నికల్ కమిటీ ఖరారు చేసింది. దీని ప్రకారం గతేడాది కన్నా ఈ ఏడాది ఎకరానికి ఎర్ర మిర్చి సాగుకు రూ.35-50వేలు, పచ్చి మిర్చికి రూ.10వేలు ఖరారు చేశారు. వరికి రూ.ఐదారువేలు, పత్తికి రూ.నాలుగైదు వేలు పెరిగింది. ఖరీఫ్ వరికి రూ.46-52వేలు, రబీలో రూ.50-55వేలు, శ్రీవరికి రూ.35-40వేల చొప్పున బ్యాంకులు రుణాలివ్వనున్నాయి. పత్తికి ఇరిగేషన్ ఏరియాలో రూ.48-55వేలు, వర్షాధార ప్రాంతాల్లో రూ.46-51వేలు, పచ్చిమిర్చికి రూ.లక్ష నుంచి రూ.లక్షా10వేలు, ఎర్రమిర్చికి రూ.రూ.1.50లక్షల నుంచి రూ.1.75లక్షలకు రుణ పరిమితి పెంచారు. గతేడాది కన్నా వర్జీనియా పొగాకుకు రూ.10వేలు, చెరకుకు రూ.5వేలు పెంచారు. కందికి రూ.6వేలు, మినుముకు రూ.6-8వేలు, పెసరకు రూ.2వేలు,



శనగకు రూ.3వేలు, సన్‌ఫ్లవర్‌కు రూ.5వేలు, వేరుశనగకు రూ.3వేలు, ఆయిల్‌పామ్‌కు రూ.5వేలు పెంచారు. అరటికి రూ.6-10వేలు, మామిడి సహా ఉద్యాన తోటలకు రూ.3-5వేలు పెంచారు. చేపల పెంపకానికి 30వేలు, రొయ్యలకు 34-36వేలు, పట్టుసాగుకు 15వేలు, బాయిలర్ కోడికి 10-20, లేయర్ కోడికి 20 పెంచారు.

# క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 13 మంది అరెస్టు



ఎండాడ(సందేశం టైమ్స్)జూన్ 18: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 13 మందిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారికి మ్యూల్ బ్యాంకు అకౌంట్లను సరఫరా చేస్తున్న అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన ఒకరిని ఇటీవల అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతన్ని విచారించగా బెంగళూరులోని బిలేకహళ్లిలో డెన్ నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. సాంకేతికతను వినియోగించి డెన్‌పై సైబర్‌క్రైం పోలీసులు దాడి చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న 13 మందిని అరెస్ట్ చేయడంతో పాటు 45 సెల్ ఫోన్లు, 130 బ్యాంకు పాస్‌బుక్‌లు, 4 ల్యాప్‌టాప్‌లు, 33 ఏటీఎం కార్డులు, రెండు కౌంటింగ్ మెషీన్లను సీజ్ చేశారు. వీరంతా పలు రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. పరిచయాలు పెంచుకుని మ్యూల్ అకౌంట్లను సేకరించి వారిని బెట్టింగ్ కార్యకలాపాలకు వినియోగిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారు. వీరంతా బృందాలుగా ఏర్పడి.. రెడ్డి అన్నా 462, బెట్ భాయ్ బుక్ 52 పేరుతో వెబ్‌సైట్స్ నిర్వహిస్తున్నారు. ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్ల జైలు, రూ.25 వేలు జరిమానా

## కర్నూలు పోక్సో కోర్టు తీర్పు


కర్నూలు(సందేశం టైమ్స్)జూన్ 18: ఓ బాలికపై అత్యాచారం కేసులో కర్నూలు జిల్లా పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. నంద్యాల జిల్లా వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో బాలికను గర్భవతిని చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు తీర్పు చెప్పారు. వెలుగోడు పోలీసుల చార్జ్‌షీటు మేరకు మండల పరిధిలోని ఓ గ్రామంలో బాధితురాలు 9వ తరగతి చదువుకునేది. ఆమె తండ్రి మృతి చెందడంతో తల్లి కూలి పనికి వెళ్లేది. 2022 జూలై 14వ తేదీన బాధితురాలు తనకు కడుపు నొప్పి వస్తోందని తల్లికి చెప్పడంతో నంద్యాల



ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆరునెలల గర్భవతి అని తెలవడంతో చికిత్స చేయించుకోకుండానే గ్రామానికి వెనుదిరిగారు. గ్రామానికి వచ్చిన తర్వాత తల్లి బాలికను నిలదీయడంతో అదే వీధిలో ఉండే తెలుగు గంగాధర్ తనకు మాయమాటలు చెప్పి లోబర్చుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో పలుమార్లు అత్యాచారం చేశాడని వాపోయింది. దీంతో బాధితురాలి తల్లి వెలుగోడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఆత్మకూరు ఇన్‌చార్జి డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి పోక్సో కేసు నమోదు చేశారు. ఆ తర్వాత బాధితురాలికి ఒక మగశిశువు పుట్టి మృతి చెందాడు. శిశువు రక్త నమూనాలు సేకరించిన పోలీసులు డీఎన్ఏ టెస్టుకు పంపించారు. ఆ నమూనాలు నిందితుడి డీఎన్ఏతో సరిపోయాయని పోలీసులు కోర్టుకు నివేదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి రాజేంద్రబాబు తీర్పు చెప్పారు. అదే విధంగా రూ.25 వేలు బాధితురాలికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది.

# ఎమర్జెన్సీని మించిన మోదీ పాలన : రాఘవులు

అమరావతి,(సందేశం టైమ్స్) జూన్ 18: ప్రధాని మోదీ పాలనతో దేశానికి ఎమర్జెన్సీని మించిన ప్రమాదం వచ్చింది. దీని గురించి ప్రజలకు తెలియజేయాలి' అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు చెప్పారు. ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. 'ఎమర్జెన్సీ వల్ల ప్రజాస్వామ్యానికి, రాజకీయ వ్యవస్థకు ఎంత హాని జరిగిందో, ప్రస్తుతం ప్రధాని మోదీ అంతకంటే ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారు. ఆరోజు ప్రజలందరూ కలిసి ఎమర్జెన్సీ నుంచి దేశాన్ని ఎలా రక్షించుకున్నారో... అలాగే ఈరోజు నయా ఫాసిస్టు శక్తుల ప్రమాదం నుంచి లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని కాపాడుకోవాలి. భారత్-పాకిస్థాన్ల మధ్య కాల్పులను తానే విరమింపజేసినట్లు అమెరికా



అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి వాస్తవాలను బయటపెట్టాలని కోరితే కేంద్రం అంగీకరించడం లేదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏదో దాస్తోంది. ప్రజలకు అబద్ధాలు చెబుతోంది. అమెరికా విదేశాంగ విధానానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ ట్రంప్‌నకు దాసోహమంటోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడిని కూడా కేంద్ర ప్రభుత్వం ఖండించలేదు. ప్రధాని మోదీ, ఆయన బృందం యుద్ధోన్మాదుల్ని రెచ్చగొడుతున్నారు' అని రాఘవులు ఆరోపించారు.

# ఆయిల్, గ్యాస్ కోసం అన్వేషణ

## గుంటూరు జిల్లాలో ఓఎన్జీసీ భారీగా డ్రిల్లింగ్
## వట్టిచెరుకూరు, ఫిరంగిపురంలో పెద్దఎత్తున శోధన



గుంటూరు, (సందేశం టైమ్స్) జూన్ 18: ఓఎన్జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) గుంటూరు జిల్లాలో ఇంధన, గ్యాస్ నిక్షేపాల కోసం అన్వేషణ చేస్తోంది. దీనికోసం జిల్లాలోని పలు మండలాల్లో సర్వే చేపట్టింది. కొన్ని రోజులుగా పొలాల్లో యంత్రాలతో డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పనులు చేపడుతోంది. ఇంధన, గ్యాస్ నిక్షేపాల అన్వేషణలో భాగంగానే తాము ఈ పనులు చేపడుతున్నామని ఆ సంస్థ అధికారులు తెలిపారు. ఇప్పటికే ఫిరంగిపురం మండలంలోని పొనుగుపాడు, వట్టిచెరుకూరు మండలంలోని వల్లపాడు తదితర గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఈ అన్వేషణ జరుగుతున్నది. అన్వేషణలో భాగంగా ఏకంగా 24 వేల బోర్లు వేసి ఆయిల్, గ్యాస్ నిక్షేపాల ఉనికి ఉందో, లేదో తేల్చేందుకు ముమ్మరంగా డ్రిల్లింగ్ పనులు చేస్తున్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగానే ఈ బోర్లు వేస్తున్నారు. ఈ సర్వే కోసం మొత్తం రూ. 13.44 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తడ నుంచి ఇచ్ఛాపురం వరకు జోన్లుగా విభజించి అన్వేషణ సాగిస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఓఎన్జీసీ నిర్ణయించింది. అందులో భాగంగా ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను గుర్తించి గ్యాస్ పంపిణీ సామర్థ్యాన్ని పెంచేందుకు మినీ లిక్విఫయింగ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్జీ) ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తోంది.

# ఇంజనీరింగ్ అఫిలియేషన్లలో జాప్యం

## తనిఖీలు ప్రారంభించని ఉన్నత విద్యాశాఖ
## గతేడాది జూలై 1 నుంచే అడ్మిషన్ల ప్రక్రియ
## ఈ ఏడాది ఆలస్యం.. విద్యార్థుల ఆందోళన

అమరావతి,(సందేశం టైమ్స్) జూన్ 18: ఇంజనీరింగ్ కాలేజీలకు అఫిలియేషన్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. గతేడాది ఈ సమయానికి దాదాపుగా అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తికాగా, ఈ సంవత్సరం ఇంతవరకు ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలకు ఏఐసీటీఈ ఇప్పటికే అనుమతులు మంజూరు చేసింది. దీనికి అనుగుణంగా ఉన్నత విద్యాశాఖ కాలేజీల్లో సీట్ల భర్తీకి అనుమతులు ఇవ్వాలి. మరోవైపు కాలేజీల్లో తనిఖీలు చేపట్టి అఫిలియేషన్లు రెన్యువల్ చేయాలి. ఈ ఏడాది ఇప్పటికీ తనిఖీలు ప్రారంభించకపోవడంతో అడ్మిషన్లలో జాప్యం జరుగుతుందని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గతేడాది జూలై 1 నుంచి రాష్ట్రంలో తొలి విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ సంవత్సరం ఇంకా అఫిలియేషన్ల ప్రక్రియే ప్రారంభం కాకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యమయ్యే అవకాశం నెలకొంది. కాలేజీల తనిఖీలకు ఒక్కో కాలేజీకి ముగ్గురు చొప్పున అధికారులు కావాలి. రాష్ట్రంలో 287 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలున్నాయి. అన్ని కాలేజీల్లో తనిఖీలకు



నెలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణలో అఫిలియేషన్ల ప్రక్రియ పూర్తయింది. దీంతో ఏపీ విద్యార్థుల్లో కొందరు తెలంగాణలో చదివేందుకు మొగ్గు చూపుతారేమోనని కాలేజీలు ఆందోళన చెందుతున్నాయి. గతేడాది కొత్త ప్రభుత్వం వచ్చాక జూలైలోనే అడ్మిషన్ల ప్రక్రియ ముగించింది. దీంతో 20 వేల వరకు అడ్మిషన్లు పెరిగాయి. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. దీంతో ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పెరుగుతాయనే అంచనా ఉంది. కానీ, అఫిలియేషన్లలో జాప్యం అడ్మిషన్లపై ప్రభావం చూపుతుందేమోనని కాలేజీల యాజమాన్యాలు భావిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ పేరుతో దోపిడీలు ప్రైవేటు కాలేజీలు రిజిస్ట్రేషన్ పేరుతో దోపిడీ చేస్తున్నాయి. 'మీ కోసం సీటు నిలిపి ఉంచుతా'మంటూ చేస్తామంటూ విద్యార్థుల నుంచి రూ.10 నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నాయి.

# ఫైనాన్స్ కంపెనీలకు వందనం

## బ్యాంకు ఖాతాల్లోంచి 'ఆటోమేటిక్'గా పోతున్న నగదు
## బజాజ్ ఫైనాన్స్‌పై పోలీసులకు లబ్ధిదారుల ఫిర్యాదు



గుంతకల్లు (సందేశం టైమ్స్)జూన్ 18: చిన్నారుల చదువుల కోసం తల్లుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తున్న 'తల్లికి వందనం' సొమ్ము 'ఆటోమేటిక్'గా ఫైనాన్స్ కంపెనీలకు వెళ్లిపోతోంది. దీంతో అనంతపురం జిల్లా గుంతకల్లులో మంగళవారం పలువురు మహిళలు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బజాజ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి గతంలో టీవీ, ఫ్రిడ్జ్ తదితర వస్తువులు కొనుగోలు చేశామని, వాటికి నెలనెలా ఈఎంఐలు చెల్లించినా.. ఇంకా డబ్బులు కట్ చేస్తున్నారని దుర్గ, ఆదిలక్ష్మి, ముంతాజ్ బేగం తదితరులు చెప్పారు. ఓ మహిళ టీవీ కొనుగోలు చేసి, ఈఎంఐలు కట్టకపోవడంతో రెండేళ్ల కిందటే ఆ టీవీని కంపెనీ ప్రతినిధులు తీసుకుపోయారని.. అయినా డబ్బులు కట్ చేస్తున్నారని చెప్పారు. చదువు రాని వారికి వస్తువులు ఇచ్చి, రుణాల పేరుతో ఏళ్ల తరబడి డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోయారు. బాకీ తీరినా.. రుణాన్ని క్లోజ్ చేయడం లేదన్నారు. తల్లికి వందనం డబ్బులను తిరిగి ఇప్పించాలని పోలీసులను కోరారు.

# రాయిపాడులో వైరల్ జ్వరాలు

## ప్రతి ఇంటిలో ఒకరిద్దరు బాధితులు
## గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గిరిజనుల వినతి

రావికమతం,(సందేశం టైమ్స్) జూన్ 18: మండలంలోని చీమలపాడు పంచాయతీ శివారు రాయిపాడు గిరిజన గ్రామంలో వైరల్ జ్వరాలు విజృంభించాయి. వాతావరణంలో మార్పులు, వర్షాలు కురుస్తుండడంతోపాటు తాగునీటి వనరులు కలుషితం కావడంతో ప్రతి ఇంటిలో ఒకరిద్దరు జ్వరాలబారిన పడ్డారు. గ్రామంలో మొత్తం 80 మంది జనభా వుండగా గెమ్మిలి అనిత, చిక్కిలి అంజలి, గెమ్మిలి గంగ, గెమ్మిలి చిలకమ్మ, సీదిరి ఎరికినాయుడు, పాంగి రామారావు, తదితరులు తీవ్రజ్వరంతో బాధపడుతున్నారు. ఏఎన్ఎం వచ్చి మందులు ఇచ్చినప్పటికీ జ్వరాలు తగ్గలేదు. ఓపికతోపాటు స్థోమత ఉన్న వారు కొత్తకోటలో ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మిగిలిన వార ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. అయినప్పటికీ జ్వరాలు తగ్గడంలేదని బాధితులు వాపోతున్నారు. జ్వరంతోపాటు కాళ్లు, చేతులు పట్టేస్తున్నాయని, మంచంలో నుంచి లేచే ఓపిక కూడా ఉ ండడంలేదని చెబుతున్నారు. తక్షణమే గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా కొండ శిఖరంపై ఉన్న చలిసింగం గ్రామంలో కూడా సుమారు 30 మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు తెలిసింది. వీరిలో కొంతమంది నర్సీపట్నంలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు

# బాబోయ్ బీఎన్ రోడ్డు!

♦ అడుగడుగునా గోతులతో జనం బెంబేలు
♦ ప్రమాదకరంగా తయారైన ప్రయాణం
♦ పాడైపోతున్న వాహనాలు
♦ గత ప్రభుత్వ పాలకుల నిర్వాకంతో జనం పాట్లు
♦ ఏడాది దాటినా స్పందించని కూటమి ప్రభుత్వం



చోడవరం, (సందేశం టైమ్స్) జూన్ 18: జిల్లాలో ప్రధాన రహదారుల్లో ఒకటైన భీమునిపట్నం- నర్సీపట్నం రోడ్డు చోడవరం నియోజకవర్గం పరిధిలో అత్యంత దారుణంగా తయారైంది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పలు నియోజకవర్గాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డు నిర్వహణ, అభివృద్ధి విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల పరిధిలో పలుచోట్ల రహదారి మొత్తం ఛిద్రమై, భారీ గోతులు ఏర్పడిన విషయం తెలిసిందే. నాలుగేళ్ల క్రితం ఎన్‌డీబీ నిధులతో అభివృద్ధి, విస్తరణ పనుల కోసం అప్పటి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. అందరికన్నా తక్కువ రేటుకు కోట్ చేసిన కాంట్రాక్టర్ రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల పరిధిలో రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులు, కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే పనులు పూర్తయిన తరువాత బిల్లులు అప్‌లోడ్ చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం మొబిలైజేషన్ నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అయినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ఏడాది ఎన్నికల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మరోవైపు నిర్వహణ పనులు (రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చడం, ఇరువైపులా తుప్పలు నరకడం) చేపట్టకపోవడంతో రహదారిపై ఏటేటా గోతులు మరింత అధికం అయ్యాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోయి, వాహనాల రాకపోకలతో మరింత పెద్దవిగా తయారవుతున్నాయి. పలుచోట్ల రోడ్డు మొత్తం ధ్వంసమై, వర్షం నీటితో పంట కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ సమయం రెట్టింపు అవుతుండడం తోపాటు వాహనాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. జిల్లాలో ఇతర రహదారులను అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం.. బీఎన్ రోడ్డు గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని నియోజకవర్గం ప్రజలు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. రోడ్డు అభివృద్ధి అటుంచి.. కనీసం గుంతలు అయినా పటిష్ఠంగా పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# గిరి మహిళల కన్నీటి కష్టాలు

## రెండు మైళ్ల దూరం నుంచి నీళ్లు మోసుకొస్తున్న సిరగంపుట్టు మహిళలు
## తాజంగి సిరగంపుట్టు వీధిలో సమస్యల
## మైళ్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న వైనం

చింతపల్లి, (సందేశం టైమ్స్)జూన్ 18: మండలంలోని తాజంగి గ్రామ పంచాయతీ సిరగంపుట్టు వీధి మహిళలకు నీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో మూడేళ్ల క్రితం మంజూరైన జల్‌జీవన్ రక్షిత మంచినీటి పథకం ఇప్పటి వరకు పూర్తికాలేదు. పనులు అర్ధాంతంగా నిలిచిపోయాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో స్థానిక గిరిజన మహిళలు రెండు మైళ్ల దూరంలో ఉన్న ఊటగెడ్డ నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. ఊటగెడ్డ దూరంగా ఉండడంతో రెండు, మూడుసార్లు నీళ్ల కోసం వెళ్లడం భారంగా వుందని, ఒకేసారి మహిళలు శిరస్సుపై నాలుగు, ఐదు బిందెలను మోసుకొని వస్తున్నారు. అధిక బరువు శిరస్సుపై మోసుకురావడం వల్ల భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

# విధుల్లోకి ఐఎన్ఎస్ అర్నాల

## విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో జలప్రవేశం



విశాఖపట్నం,(సందేశం టైమ్స్) జూన్ 18: భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. సముద్ర గస్తీ, అన్వేషణ, సహాయ కార్యక్రమాలకు ఉపయోగించేలా రూపొందించిన తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ (ఏఎస్‌డబ్ల్యు-ఏఎస్‌డబ్ల్యు) ఐఎన్ఎస్ 'అర్నాల' బుధవారం జలప్రవేశం చేయనుంది. విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగే ఈ కార్యక్రమానికి డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అధ్యక్షత వహిస్తుండగా, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ఆతిథ్యం ఇస్తున్నారు. ఈ నౌకను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ డిజైన్ చేసి తయారు చేసింది. పీపీపీలో భాగంగా ఎల్ అండ్ టీ షిప్ బిల్డర్స్ దీనికి సహకారం అందించింది. ఈ తరహా నౌకలు మొత్తం 16 తయారు చేయాలని నేవీ నిర్ణయించింది. అందులో అర్నాల మొదటిది. మహారాష్ట్రలోని చారిత్రాత్మక అర్నాల కోటకు గుర్తుగా దీనికి ఈ పేరు పెట్టారు. గత నెల 8న దీన్ని నేవీ చేతికి అందించగా.. విశాఖలో బుధవారం జలప్రవేశం చేయిస్తున్నారు. అర్నాల 77.6 మీటర్ల పొడవు, 1,490 టన్నుల బరువు ఉంటుంది.

# పల్నాడులో ముగ్గురు కౌలు రైతుల ఆత్మహత్య

## ఒకే రోజు అప్పులకు బలి
## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఉన్నతాధికారులు



నాదెండ్ల/ఈపూరు,(సందేశం టైమ్స్) జూన్ 18: వ్యవసాయంలో నష్టాలతో అప్పుల పాలైన ముగ్గురు రైతులు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లాలో జరిగింది. నాదెండ్ల మండలం నాదెండ్ల గ్రామంలోని రామాపురం కాలనీకి చెందిన నాసం ఆదినారాయణ(45) ఏడు సంవత్సరాలుగా తన ఎకరన్నరతో పాటు సుమారు 50కి పైగా ఎకరాలను కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి, శనగ తదితర పంటలు సాగు చేస్తున్నాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక పోవటంతో పాటు పైర్లు తెగుళ్ల బారిన పడటం, గిట్టుబాటు ధర లేక పోవటంతో సుమారు రూ 70 లక్షల అప్పులపాలయ్యాడు. రుణదాతలు ఇంటికి వచ్చి ఒత్తిడి చేయటంతో తట్టుకోలేక గ్రామ సమీపంలోని పొలాల్లో రాత్రి పురుగు మందు తాగాడు. ఉదయం ఆదినారాయణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అదే విధంగా మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు(44) తన 30 సెంట్లతో పాటు సుమారు 12 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది మిర్చి పైరుకు తెగుళ్లు సోకటంతో పెట్టుబడులు కూడా దక్కలేదు. పొగాకు పండించినా కొనే వారు లేక పోవటంతో నిల్వ చేసి పట్టాలు కప్పాడు. సుమారు రూ.20 లక్షల మేర అప్పులపాలయ్యాడు. సాయంత్రం తన ట్రాక్టర్‌ను అప్పు ఇచ్చిన వారు తీసుకెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడు. తన ఇంటికి సమీపంలోని డొంక వద్దకు వెళ్లి పురుగు మందు తాగి మృతి చెందాడు. ఎస్ఐ పుల్లారావు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడిన రైతులు గోపాలరావు, ఆదినారాయణ కుటుంబాలను వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సాయంత్రం పరామర్శించారు. రైతుల ఇంటికి వెళ్లి వారి భౌతిక కాయాలకు నివాళులర్పించారు. ఆత్మహత్యకు దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరుగుతుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. కాగా.. ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన బండి కొండయ్య (52) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. మూడు ఎకరాల్లో మిర్చి, ఎకరన్నరలో వరి, అర ఎకరంలో పొగాకు సాగు చేశాడు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రాక, అప్పులు రూ.4 లక్షలు తీర్చే మార్గంలేక మనస్తాపం చెంది కౌలుకు తీసుకున్న పొలంలోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని చిన్న కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

# సరుగుడు సాగుకు మొగ్గు

## ఏటేటా పెరుగుతున్న విస్తీర్ణం
## వరి, చెరకు సాగు భారంగా మారడమే కారణం
## ప్రత్యామ్నాయ పంటలవైపు రైతుల చూపు

(సందేశం టైమ్స్) జూన్ 18: వరి, చెరకు పంటల సాగు ఖర్చులు, పెట్టుబడి పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న అరకొర మద్దతు ధరలు గిట్టుబాటు కావడం లేదంటూ పలువురు రైతులు సరుగుడు తోటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గత సీజన్ వరకు చెరకు సాగు చేసిన రైతులే వున్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా నుంచి పేమెంట్ల వరకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, వచ్చే సీజన్‌లో చెరకు క్రషింగ్ జరుగుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొనడంతో సరుగుడు నాట్లు వేస్తున్నట్టు చెబుతున్నారు. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సరుగుడు మొక్కలు నాటుతున్నారు. పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం, నికరంగా ఆదాయం వచ్చేఅవకాశం వుండడంతో వరి, చెరకు సాగు చేసిన భూముల్లో సరుగుడు వేస్తున్నట్టు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు రూ.30-35 వేలు, చెరకు సాగుకు రూ.50-60 వేలు పెట్టుబడి అవుతున్నది. దీనికితోడు కూలీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకుంటే కొన్నిసార్లు పెట్టుబడి కూడా రావడంలేదు. కుటుంబ సభ్యుల శ్రమపాటు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. అదే సరుగుడు (రకాన్నిబట్టి) సాగు చేసుకుంటే ఎకరాకు ఐదేళ్లపాటు గరిష్ఠంగా రూ.40 వేలు పెట్టుబడి అవుతుంది. ఎకరాకు గరిష్ఠంగా 60-70 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం పేపర్ మిల్లులు టన్ను రూ.6-7 వేలకు కొనుగోలు చేస్తున్నాయి. ఐదేళ్లకు ఖర్చులుపోను



రూ.4 లక్షల వరకు మిగులుతాయి. ఏటా ఎకరాకు సగటున రూ.80 వేలు ఆదాయం వస్తుంది. నాలుగైదేళ్ల క్రితం వేసిన సరుగుడు తోటలు ప్రస్తుతం కోతకు రావడం, ఆయా రైతులు సంతృప్తికరమైన ఆదాయం పొందుతుండడంతో చెరకు, వరి సాగుచేసే రైతులు ఈ పంటలకు స్వస్తిపలికి సరుగుడు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో మెట్ట, బంజరు భూములు, గరప నేలల్లో మాత్రమే సరుగుడు తోటలు సాగు చేసేవారు. కొన్నేళ్ల నుంచి వరి, చెరకు సాగు చేసే పల్లం , నల్లరేగడి భూముల్లో కూడా సరుగుడు వేస్తున్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006